# మధ్యతరగతి మరో మందహాసం

## పాలగిరి వేణు

స్టేషన్లో రైలాగింది ...

కోలాహలంగా జనం ... ఎక్కడాలు... దిగడాలు...కదలికలూను. ఆ 'కంపార్ట్‌మెంట్' లోంచి, ప్లాట్‌ఫారమ్మీద రెండు చేతుల్లోను బరువులతో దిగేసరికి సగంప్రాణం పోయినట్లయింది. ఒక చేతిలో తాటాకుబుట్ట అందులో అత్తగారు ఎంతో ఆప్యాయతగా యిచ్చిన ఆవకాయ జాడి, ఇంకో చేతిలో సంచి అందులో మా అమ్మగారు అనురాగంతో పంపిన మినప సున్నుండలు ప్లస్ తదితర నా సామాన్లూను... రెండూ బరువుగానే వున్నాయి ... ఆప్యాయత అనురాగం కల్సివున్నాయి మరి.

బ్రిడ్జి దాటి టికెట్ కలెక్టరు చేతిలో టికెట్ వుంచి స్టేషన్లోంచి బయట పడ్డాను.

రిక్షావాళ్లు, ఆటోవాళ్లు నన్ను చుట్టేశారు ఊపిరి సలపనీయడంలేదు.

''అయ్యా !''

''బాబూ !''

''సార్ ! ! !'' ఎక్కడికెళ్ళాలంటూ గోల చేసేస్తున్నారు, సామాన్లు అందుకొని, కొంచెం ముందుకు నడిచాను ... అక్కడయితే కిరాయి ఎక్కువ అడుగుతారు ... అందుకని ! అయినా ఒకరు నా వెంటబడ్డారు. ఒవిరిగడ్డాన్ని బరుకుతున్నాడు నొసటన విబూధి మధ్యలో ఎర్రటి కుంకుమబొట్టు అయినా నోట్లో చుట్ట వెలుగుతోంది.

''ఎక్కడికెళ్ళాలండీ పంతులుగారూ ...''

''గాంధీనగరం మూడో రోడ్డు... నాకేం రిక్షావద్దు...నడవగలను...

''భలేవారండీ ! చేతుల్లో అంత బరువుంచుకుని నడవగలరటండీ ... ఓ రెండు రూపాయలివ్వండి చాలు ... రెండు నిముషాల్లో ఇంటిదగ్గర చేరుస్తాను.''

అమ్మో ! రెండు రూపాయలే !! ఓపూట కూరలు గడుస్తాయి ... ఓ రోజుకు పాలు ... పెరుగు...ఊహూ ! మధ్యతరగతి... అందులోను సామాన్యుని 'బడ్జెట్' సణుగుడు...లాభంలేదు... అయినా ఎన్నిసార్లు స్టేషన్నుండి యింటికి నడవలేదు? కాని యీసారి చేతుల్లో బరువెక్కువుంది మరి...అందులోను ఎండ మరింతవిరగకాస్తోంది.

''పోనీ ! ఓ రూపాయిస్తా !'' తెగించి అడిగాను.

నిరసనగా నావైపు చూశాడు.

''ఇంకో అర్ధరూపాయి వేసుకోండి''

లాభం లేదన్నట్లు సామాన్లు చేతుల్లోకి తీసుకుని ముందుకు నడిచాను ... ఎండకు కాగిన ''తారురోడ్డు'' సలసల మంటోంది.

''పావలా.''

'' ఊ హూ ! '' అంటూ నడుస్తూనే వున్నాను ... పది నిముషాల నడకతో యిల్లు చేరుకోవచ్చు.

రిక్షావాడు వచ్చేవాడేమో గాని యింతలో యింకో శాల్తీ తగిలింది. 'నీట్'గా వున్నాడు ... చేతిలో అందమైన ''బ్రీఫ్‌కేస్''... గాంధీనగరం సెంటర్ కన్నాడు. రిక్షావాడు మూడురూపాయ లన్నాడు ... ''ఓకే!'' అంటూ భుజాలెగరేసూ రిక్షాలో కూచున్నాడు ... గజ్జెల చప్పుడు చేసుకుంటూ రిక్షా కదిలింది ... పోనీలే ! అదృష్టవంతుడు...నాసిరకం బేరం తప్పింది... వెళ్ళేటప్పుడు రిక్షావాడు నన్నుచూసిన చూపు మాత్రం కొంచెం బాధాకరంగా వుంది...

ఇంతలో యింకో రిక్షా...

''గాంధీనగరం మూడో రోడ్డు ... ఒక్క రూపాయిస్తా...వస్తే...రా!... లేకపోతే...''

''వెళ్తా !'' నంటూ యింకో మాటకు అవకాశం యివ్వకుండా పారిపోయాడు ఆ రిక్షావాడు. నడుస్తున్నాను ... ఏకధాటిగా ... ఇల్లు చేరుకోవడమే ఏకైకగమ్యం. ఎండ దంచేస్తోంది. మధ్యాహ్నం రెండు గంటలు. వేడిగాలి...ఒళ్ళంతా చెమట పోస్తోంది. 'రోడ్డు' నిర్మానుష్యంగా వుంది. పది అడుగులేసేసరికి కొంచెం చేతులు లాగినట్లాయ్యాయి. రోడ్డు ప్రక్కన నిలబడి సంచి, బుట్ట నేలమీద ఆన్చి...రెండే రెండు నిముషాలు ... విశ్రాంతి ...; మళ్ళీ నడక ... చేతుల్లోకి బరువు మార్చి ...ఇంకో అరఫర్లాంగు నడిచాను ... చేతులు బాగా లాగుతున్నాయి. జబ్బలు మరీను. ఒళ్ళంతా తడిసిపోతోంది చెమటతో...అయినా యింకెంత దూరముందని... గాంధీనగర్ సెంటర్ దాటితే మూడో మలుపు... అనవసరంగా రూపాయి ఖర్చయ్యేది. ఆ రూపాయకు పావుకిలో వంకాయలొచ్చేవి...లేపోతే అరకెజీ పుచ్చు బెండకాయలొచ్చేవి. రూపాయి ఖర్చుకాకుండా బిగ్గట్టేశాను...అదేంటి! ...దాహమవుతుంది. నాలిక పిడచగట్టుకపోతోంది ... గొంతుక ఎండిపోయింది. అడుగు ముందుకు వేయలేకపోయాను ... అలసిపోయినట్లన్పించింది.

ఓ అబ్బాయి 'సోడా బండి' తోసుకుంటూ వస్తున్నాడు ... బండి దగ్గరకొచ్చింది,

''ఓ సోడా !'' అంతకన్నా గొంతులోంచి బయటకు పూడిపడలేదు.

''మామూలు సోడాలేదు ... నిమ్మకాయ సోడావుంది. యిమ్మంటారా ?''

ఇమ్మని సైగచేశాను. సీసాలో గ్యాసున్నట్లు లేదు. అయినా కొట్టేటప్పుడు మాత్రం పెద్ద చప్పుడు చేయించాడు ఆ సోడా కుర్రాడు. సోడా... జిగురుగా ... అసహ్యంగా ... నోరంతా చేదుగా వుంది. నిమ్మకాయ బదులు ... 'సిట్రిక్ ఆసిడ్' వాడుండాలి.

''అర్ధరూపాయివ్వండి ... ''

''అదేంటి ! ముప్పైయేగా ... ''

''స్పెషల్ సోడాండి బాబూ ! బరంపురం నిమ్మకాయల రసం ... ఏమనుకున్నారో ! యింకోటి యియ్యమంటారటండీ !''

''నీళ్ళు మాత్రం కృష్ణవేనా ! లేకపోతే గోదారినుండి తెప్పించావా ?''

నేనడిగేది వాడికి అర్థం అయినట్లులేదు. నేను వద్దనక పోతే యింకో కాయ కొట్టేట్టుగా వున్నాడు. జేబులోంచి చిల్లర తీసిచ్చాను.

''అదేంటండీ ! మళ్ళీ ముప్పై ఇచ్చారు. ఏభై పైసలు తగ్గదండీ ... బరంపురం నిమ్మకాయలండీ బాబూ ... ఇరవై పైసలివ్వండి. మాడు మండుతోంది.''

తప్పలేదు. ఇరవై పైసలిచ్చాను. బండివాడు ఏదో హుషారుగా పాడుకుంటూ వేగంగా వెళ్ళిపోయాడు. ఈ సోడా దాహం తీర్చలేదు మరింత దాహం పెచ్చింది. శుభ్రంగా యింటికెళ్ళుంటే ఏ మజ్జిగతోనో దాహం తీరేది. అర్థరూపాయి మిగిలేది. మళ్ళీ నడక ... బరువుల మార్పు...కాగిన రోడ్డువేడి పైకి తంతోంది... ఓ గజ్జి కుక్క సిమెంటు పీపా ప్రక్కన కూలబడి నాలిక వేలాడేసి జొల్లు కారుస్తోంది. చెమటకు తడిసి, ఒంటికి అతుక్కుపోయింది. ప్యాంటు సంగతి చెప్పనవసరం లేదు ... అరచేతులు ఎర్రబారి వాతలు పడుతున్నాయి ... వెన్నుపూసలోంచి వేడి... తలమీదనుండి చెమటకారి నుదుటిమీదుగా జారి కళ్ళల్లో బడుతోంది. భుజంతోనే తుడుచుకున్నాను... ఇంకెంత దూరం ? ఓ రెండు ఫర్లాంగులు... కాళ్ళు నరాలు కదులుతున్నట్లుంది... చేతులు మరీ నొప్పెట్టున్నాయి. దాహం... మళ్ళీ దాహం... నోరెండిపోతోంది... ఏదైనా రిక్షా వస్తే బావుణ్ణు... ఎంతో అంత పారేసి యిల్లు చేరుకోవచ్చు... అదిగో రిక్షా వచ్చేసింది... ఎక్కడి

కళ్ళాలో చెప్పాను. ''రెండు రూపాయలివ్వండి...'' ఎంతో తాపీగా అడిగాడు... నాకు కోపం తన్నుకు వచ్చింది. ''వెళ్ళెళ్ళు'' అంటూ కసురుకున్నాను. రిక్షావాడు నామీద కోపంగా ''రిక్షా ఎక్కిన ముఖమేనా'' అన్నట్లూ చూస్తూ కదిలిపోయాడు. ఒక్కసారిగా అత్తగారిమీద, అమ్మమీద కోపం వువ్వెత్తున వచ్చింది. ఏంటో ఆవకాయ... మినప సున్నుండలు... యివి తినలేకపోతే చస్తామా ? ఏంటి ? ? మురిక్కాల్వలో గిరాటేసి పోతే బావుణ్ను...హాయిగా నడిచి వెళ్ళిపోవచ్చు... అయినా అత్తగారు ఎంతో ఆప్యాయతతో... అమ్మ ఎంతో అనురాగంతో... పోనీలే ! బరు వయితే అయ్యింది.. ఇంకెంతసేపు... అదిగో కనపడేదే 'సెంటర్'... అది దాటితే మూడో మలుపు... మొగదాల్లోనే యిల్లు... అదేంటి దాహం... మళ్ళీ మొదలు... పిడచగట్టుకు పోతోంది నాలుక...తడి ఆరిపోయింది కంఠంలో... తూలి పడుతున్నట్లు అడుగులేస్తూ 'సెంటర్' చేరుకున్నాను. సెంటర్లో వున్న టీకొట్టు మూయబడివుంది. పక్కనే బడ్డీకొట్టు... ఎండలో వ్యాపారం లేక జోగుతున్నాడు కొట్లో వున్న ఓ ముసలతను.

''మంచినీళ్ళున్నాయా !''

నన్ను కళ్ళు తెరిచి చూశాడు ఆ కొట్టాయనే... మళ్ళీ మూసుకున్నాడు.

చిన్నగా దగ్గాను.

''ఇక్కడ మంచినీళ్ళుండవు... సోడా లుంటాయి'' అంటూ కళ్ళు తెరిచాడు.

''సోడా తాగుతాను... మంచినీళ్ళు కూడ తాగుతాను ''

''సోడాయే తాగు... మంచినీళ్ళు లేవు.''

''తప్పదా !''

''తప్పదు.''

''అయితే సోడాయివ్వు...గ్యాసుండాలి...'' అంటూ కాళ్ళ సందున వుంచుకున్న సంచీని సరిచేసుకోవట కోసం కిందకు వంగాను.

''ఇదిగో... త్వరగా తాగు... గ్యాసు పోతుంది...'' అంటూ 'బిస్లెరీ సోడా' అందించాడు కొట్టుబాబు...

''ఇదేంటి ! నాకు గోలీ సోడా కావాలి...'' అంటూ తిరిగి సీసాను అతడికి యివ్వాయ బోయాను...

''అదేంటి ! 'ఓపెన్' చేసిన సీసాను నేనేం చేసుకోవాలి ?''

''నీ యిష్టం...''

''నా యిష్టమెలా అవుతుంది...—అయినా నీవు గోలి సోడా కావాలని అడగలేదుగా... సోడా యిమ్మన్నావ్ ? ఉన్న సోడా యిచ్చాను అంతే ! తాగేసేయి...లేపోతే ఝుమ్మని గ్యాసుపోతుంది.''

''నాకొద్దు... గోలీ సోడాయే కావాలి ... ఈ సోడా నా ఒంటికి పడదు...''


''అదంతా నాకు తెలియదు... ఈ సోడా నీవు తాగాల్సిందే... మాంచి బేరమే !''

''మాంచి బేరం అవునో కాదో నాకు తెలియదుకాని ఈ సోడా మాత్రం నాకొద్దు...'' అంటూ సీసా బల్లమీద పెట్టేశాను. ''వద్దంటే ఎలాగండీ సామీ !'' అంటూ కొట్టుబాబు బాధ పడిపోతున్నాడు.

''పెద్ద రాద్ధాంతమెందుకండీ పంతులు గారూ ! సోడాకోసం...!! ఏదో గోలీసోడా అను కునే తాగేయండి కళ్ళు మూసునుని ... మీరు తాగకపోతే నాకిచ్చేయండి...నే తాగేస్తాను...కాని పైసలు మాత్రం మీరిచ్చుకోవాలి...'' అంటూ ఓ మధ్యవర్తి మీసాల్ని మెలేసుకుంటూ ముందు కొచ్చాడు...

''మంచిమాట చెప్పావ్ ! పోతురాజా !'' అంటూ కొట్టుబాబు హుషారుగా నవ్వాడు.

వీడెవ్వడ్రా పోతురాజు...? యమధర్మరాజు గారిలాగా... ! వేషం కూడా అలాగే వుంది. బలవంతానైనా నాతో తాగించేసి, లేపోతే తనే తాగేసి డబ్బులు ముక్కుగుద్ది నా దగ్గర వసూలు చేసేలా వున్నాడు ...... ఆపసోపాలు పడుతూ సీసాను నోటిదగ్గరకు లాక్కొని గడగడతాగేశాను. ఒట్టి నీళ్ళలా వుంది. ఏలాంటి పొంగులేదు ... గ్యాసు...సీసాలోంచి మాయమయిపోయిన రాక్షసు డిలా వుంది. అవును పోట్లాటలో సరిపోయింది. లేకపోతే 'గ్యాసు' వుండేది ...డబ్బుకు తగ్గట్టు



# మీ అభిప్రాయం చెప్పండి

తుఫానుల గూర్చి రేడియోలో చేయబడే హెచ్చరికలు మీరు వింటూనే ఉంటారు. తుఫాను బీభత్సం మీలో కొందరికి అనుభవంలోకి వచ్చి ఉంటుంది. మేము చేసే హెచ్చరికలు ప్రజలకు ఎంతవరకూ అవగాహన అవుతున్నాయో, ఎంతవరకూ ఉపయోగకరంగా ఉంటున్నాయో, వాటిని మెరుగుపర్చవలసిన అవసరమేమైనా ఉన్నదేమోనని తెలుసుకోవడం కోసం ఈ క్రింద యిచ్చిన ప్రశ్నావళి రూపొందించబడింది. దీనికి జవాబులిచ్చి మాతో సహకరించవలసిందిగా ఆంధ్ర ప్రజానీకాన్ని ముఖ్యంగా తీరప్రాంత ప్రజలను కోరుతున్నాము. జవాబులు ఒక కార్డుమీద వ్రాసి అక్టోబరు 5వ తేదీలోగా మాకు అందేటట్లు పంపవలెను. మీరు జవాబులు పంపవలసిన ఎడ్రస్సు : **A. V. R. K. RAO, N. H. A. C. Mausam Bhavan, Lodi Road, New Delhi-110003.**

మీ పేరు, వయస్సు, వృత్తి కూడ అందులో తెలుపవలెను. పేరు రాయడం యిష్టం లేనిచో మానివేయవచ్చును.

ప్రశ్నలు :

1. తుఫాను గూర్చి చేసే హెచ్చరికలు గూర్చి
   అ) మీరు స్వయంగా వింటారా ?   ఆ) ఒకరిద్వారా తెలుసుకుంటారా ?
2. తుఫాను గూర్చి, రేడియోలో యివ్వబడిన మొదటి హెచ్చరిక గూర్చి తెలుసుకున్న తరువాత, మిగతా హెచ్చరికలు మీరు స్వయంగా వింటారా ?
   అ) అవును   ఆ) కాదు
3. తుఫానువల్ల మీరుండే ప్రాంతానికి ప్రమాదం అని సూచించిన తదుపరి మీరు సురక్షిత స్థలానికి వెడతారా ?
   అ) అవును.   ఆ) లేదు. ఉన్నచోటనే జాగ్రత్తలు తీసుకుంటాము.
4. మీరు తీరప్రాంతంలో ఉంటున్నట్లయితే, మీ ప్రాంతంలో సురక్షిత ప్రదేశాలు నిర్దేశించబడినవా ?
   అ) అవును.   ఆ) లేదు.
5. ప్రస్తుతంలో చేస్తున్న హెచ్చరికలు మీకు సంతృప్తికరంగా ఉంటున్నవా ?
   అ) అవును.   ఆ) లేదు.
   మీ జవాబు 'లేదు' అయినట్లయితే, మెరుగుపర్చడానికి మీ సూచనలేమైనా యివ్వండి క్లుప్తంగా.
6. మీరుండే ప్రదేశం వెళ్ళవలసివస్తే మీకు ఎంత ముందుగా హెచ్చరిక చేయాలి ?
7. రేడియో హెచ్చరికలు కాకుండా, మరే విధమైన పద్ధతులైనా మీ ప్రాంతంలో అమలులో ఉన్నవా ?
8. తుఫాను మీరుండే ప్రాంతంలో తీరాన్ని తాకేటట్లయితే మీరు తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి మీకు తెలుసునా ?
   అ) తెలుసు   ఆ) పూర్తిగా తెలియవు.   ఇ) తెలియవు.
9. ప్రతి తుఫాను సీజను ముందు, దానివల్ల కలిగే నష్టములు గూర్చి రేడియో ప్రసంగాల ద్వారాగాని, ఫిల్ముల ద్వారాగాని ప్రజలకు ఎరుకపరచడం అవసరమంటారా ?
   అ) అవును.   ఆ) కాదు.
10. రేడియో హెచ్చరికలలో ఉపయోగించే పదములకు అర్థం మీకు పూర్తిగా అవగాహన అవుతోందా ?
    అ) అవును.   ఆ) లేదు.

— ఎ. వి. ఆర్. కె. రావు

## మధ్యతరగతి మందహాసం

తృప్తి వుండేది. రెండు రూపాయల నోటిస్తే కొట్టుబాబు ఎనభై పైసల చిల్లర పోశాడు నా చేతిలో. అవునూ! శుభ్రంగా ఓ రూపాయిన్నర రిక్షావాడి చేతిలో పెట్టుంటే యీపాటికి హాయిగా యింట్లో మా ఆవిడ, పిల్లలతో కాలం గడిపేవాణ్ణి. ఖర్మ ! ... అనుభవించాలి...లేకపోతే ! దాహం ... అందుకోసమై రూపాయి డభై పైసలు ఖర్చు ... ఇలా ఖర్చు పెడుతూపోతే బ్రతికి బాగుపడ్డట్టే... ! ఖర్మకు తగ్గట్టు ఖర్చుతప్పదుమరి. మళ్ళీ నడక...మూడో మలుపు ఓ ఫర్లాంగుదూరంలో కన్పడుతోంది... ఇంకో మూడు నిమిషాల నడక ... ఇల్లు చేరుకున్నట్లే...నాలో ఉత్సాహం పెల్లుబుకుతోంది... చకచకనుని అడుగులేస్తున్నా ... అదేంటి కాళ్ళు తేలిపోతున్నాయి...జబ్బలు విపరీతంగానొప్పులు... సామాన్లు కింద పెట్టేశాను ... ఉన్నట్లుండి కణతన నరాలు చిట్లుతున్నట్లు ... ఇక బాధ భరించలేకుండా వున్నాను... కళ్ళు బైర్లు కమ్మి చుట్టూ చీకటలు పోతోంది ... గుండె చప్పుడు పెద్దదవుతూంది...మైకం కమ్ముతున్నట్లు నడిరోడ్డుమీదే తూలిపోతూంటే ఎవరో ఆసరా యిచ్చారు... రిక్షాలో కూచోబెట్టారు ... కళ్ళు మూసుకున్నాను బరువుగా ...

రిక్షా ఆగుతూనే కళ్ళు విప్పి చూశాను... మా వీధిలో వున్నాను ... రిక్షావాడు అదే బవిరి గడ్డం ... నొసటన విబూధి ... మధ్యలో రాలి పోతున్న ఎర్రటి కుంకుమ.

"ఇల్లెక్కడండి పంతులుగారూ..."

చూపించాను... రిక్షా నడిపిస్తూనే యిల్లు దగ్గర చేర్చాడు... మా పెద్దోడు "నాన్నారు వచ్చేశారు" అంటూ హుషారుగా రిక్షా దగ్గర కొచ్చి సంచిఅందుకుని యింట్లోకిపారిపోయాడు.

జేబుల్లోంచి రూపాయితీసి రిక్షాఅబ్బాయికి యివ్వబోయాను...అతను వద్దన్నాడు.

"వద్దండి పంతులుగారూ! ... మంచితీర్థమిప్పించండి చాలు."

"అదేంటి బాబూ ! మీరు యింత దూరం నడవగాలేంది నా దెంతదూరం బాబూ ! ఈ బారడంత దూరానికి డబ్బులు పుచ్చుకోవాలా!" అంటూ రిక్షాలోనే కూలబడ్డాడు.

మా ఆవిడకు చెప్పి మజ్జిగ తెప్పించి యిచ్చాను... తృప్తిగా తాగాడు... వస్తానంటూ వెళ్ళిపోయాడు.

"అదేంటండీ ! స్టేషన్నుండి యింటికి రావటానికి రిక్షాలు కావాల్సి వచ్చిందటండీ! ఇక సంసారం యీదినట్లే !! అదిగాక రిక్షావాడికి మహారాజ మర్యాద లేమిటండీ ! చోద్యం గాకపోతేను..." అంటూ సాగదీస్తుంటే మధ్యతరగతి మందహాసాన్ని విసిరి ... నీరసంగా కళ్ళు మూసుకున్నాను పడక కుర్చీలో కూలబడి. ★